# పితృదేవోభవ

**- వసంతకుమార్ సూరిశెట్టి**

సూర్యకిరణాలు నెమ్మది నెమ్మదిగా లోకాన్ని కాంతివంతం చేస్తున్న సమయమది. అప్పటికే రకరకాల వంటకాలతో డైనింగ్ టేబుల్ నిండిపో యింది. అమెరికాలోని న్యూజెర్సీ నుంచి రాబోతున్న తన కొడుకు మాధ వ్‌కీ, కోడలు మార్గరేట్‌కి ఇష్టమైన స్వీట్స్ తయారు చేయడంలో బిజీగా వుంది కామేశ్వరి.

"ఏవండీ! టైం అప్పుడే ఆరయిపోయింది. ఫ్లైట్ పదిగంటలకి. ఇప్పుడు బయలు దేరితేనే సరిగ్గా వుంటుంది" భర్త రామారావుకి వినిపించేటట్లుగా చెప్పింది వంట గదిలోంచి కామేశ్వరి.

"కొడుకూ కోడలూ రాబోతున్నారనా అంత సంతోషం. కొంచెం వాళ్లొచ్చేవ రకూ దాచుకో. ఇదిగో నాన్నగారికి టవల్ బాత్ చేయించి బయలుదేరుతాను" నవ్వుతూ చెప్పాడు రామారావు.

పక్షవాతం వచ్చి ఒక కాలు, చేయి పడిపోవ డంతో మంచానికే అంకితమైపోయాడు రామ నాథం.

"నాన్నగారూ! లేవండి స్నానం చేయించే స్తాను" అంటూ ఆయన వేసుకున్న బట్టల్ని నెమ్మ దిగా తీసివేసి టవల్‌తో ఒళ్లంతా తుడుస్తూ ఉంటే చూసాడు తండ్రి కళ్లల్లోంచి కారుతున్న కన్నీటిని.

"ఎందుకు నాన్నా ఏడుస్తున్నారు? ఇవ్వాళ మీ మనవడూ, మనవడి భార్య ఇక్కడికి వస్తున్నారు. అందువల్ల మనసులో ఏదీ ఆలోచించకుండా సంతోషంగా ఉండాలి మరి" అంటూ స్నానం చేయించి బట్టలు మార్చాడు రామారావు. కామే శ్వరి తెచ్చి ఇచ్చిన టిఫిన్‌ని తండ్రికి తినిపించి ఎయిర్‌పోర్ట్‌కి బయలుదేరాడు రామారావు.

ఇంటికి వచ్చిన కొడుకూ కోడల్ని చూసి తెగ సంబరపడిపోయింది కామేశ్వరి.

మార్గరేట్‌కి ఇల్లూ, వాతావరణం కొత్తగా వుంది. ఇక్కడ ఒకరికోసం ఒకరు జీవించడం, ప్రేమాను రాగాలు పంచుకోవడం చూసి ఆశ్చర్యపోయింది. తల్లీదండ్రీ, భార్యా భర్తా, కొడుకూ కోడలూ, కూతురూ అల్లుడూ... ఇలా అందరి బాంధవ్యాలూ ప్రేమపాశంలో చిక్కుకుని ఉండడం, ఒకరి గురించి మరొకరు కష్టాన్ని కూడా సంతోషంగా అనుభవించడం చూస్తుంటే ఆనందంతో పులకరిం చిపోయింది మార్గరేట్.

అమెరికాకి చెందిన మార్గరేట్ మాధవ్‌ని చూడ గానే ప్రేమించేసింది. భారతదేశ సంస్కృతి గురించి, మమతానురాగాల గురించి విన్న మార్గ రేట్ తనకి తెలియకుండానే భారతదేశం మీద పిచ్చి అభిమానాన్ని పెంచుకుంది. అందుకే మాధవ్‌ని చూడగానే ప్రేమించేసింది. అందం, సంస్కారం వున్న మార్గరేట్ అంటే మాధవ్‌కీ చాలా ఇష్టం ఏర్ప డింది.

అయినా తన తల్లిదండ్రులు ఒప్పుకుంటేనే పెళ్లి, లేకపోతే లేదు అని ఖచ్చితంగా, నిర్మొహమా టంగా చెప్పిన మాధవ్‌ని ఇంకా ఇష్టపడిపోయింది మార్గరేట్.

అలాగే ఇండియా నుంచి తల్లిదండ్రుల అను మతి దొరికిన తరువాతనే మార్గరేట్ పెళ్లి చేసుకు న్నాడు మాధవ్.

దాదాపు రెండు సంవత్సరాల తరువాత ఇద్దరూ ఇండియాకు వచ్చారు.

బాల్కనీలో నిలబడి చుట్టుప్రక్కలకి చూస్తున్న మార్గరేట్ దగ్గరకు వచ్చాడు మాధవ్.

బంగారు ఛాయలో తళతళలాడుతున్న తల వెంట్రుకలు గాలికి ఎగురుతూ వుంటే అందంగా చందనపు బొమ్మలా వున్న మార్గరేట్ మాధవ్‌ని చూసి-

"అమ్మా! నాన్నగారు, ఈ ఇల్లు, ప్రశాంతమైన ఈ వాతావరణం, కళ్లతోనే ప్రేమని పంచే తాతయ్యా గారూ... నాకిక్కడ చాలా బావుంది మాధవ్" అంది.

ఆమె మాటల్లో నిజాయితీ కనిపించింది.

"నీకో విషయం తెలుసా? అమ్మ మొదట్లో మన పెళ్లికి ఒప్పుకోలేదు. నాన్నగారే అమ్మ దగ్గర మాట్లాడి, నచ్చచెప్పి మనసు మార్చారు. నేను వచ్చేటప్పుడు తాతయ్య బాగానే వున్నారు. ఇప్పుడు ఇలా చూస్తుంటే చాలా బాధగా వుంది. మా ఇంటికి సంబంధించినంతవరకూ నాన్నగారే అన్నీనూ. తాతగారి మనసు కష్టపడకుండా, అమ్మ మనసు నొప్పించకుండా చాలా శాంతంగా వుంటారు. చాలా పెద్ద మనసుతో నిన్ను కోడల్ని చేసుకున్నారు. నాన్నగారంటే అందుకే నాకంత ఇష్టం" అంటూ తన తండ్రి గురించి గొప్పగా చెప్పసాగాడు మాధవ్.

"మధూ! నా డెలివరీ టైములో అమ్మా నాన్నా వుంటే బావుంటుందని, వాళ్లని మనతోపాటు తీసు కుని వెళ్దామని అనుకున్నాం కదా. వాళ్ళు మనతో వస్తారంటారా?" దీనంగా అడిగింది మార్గరేట్.

"ఖచ్చితంగా వస్తారు మార్గరేట్. మనవడ్ని చూడాలన్న కోరిక వాళ్లకి మాత్రం ఉండదా? తాత య్యకి ఏదో ఒకటి అరేంజ్ చేసిన తరువాత వాళ్లని మనతో తీసుకుని వెళ్దాం" అన్నాడు మాధవ్ ఆమెని సమాధాన పరుస్తూ.

***

"తాతయ్యా! మార్గరేట్ మీతో ఏదో మాట్లాడా లంటోంది" అంటూ తాతయ్యకి దగ్గరగా వచ్చి కూర్చున్నాడు మాధవ్.

"రామ్మా! ఇలా వచ్చి కూర్చో" దగ్గరకి పిలి చాడు తాతయ్య.

"తాతయ్యగారూ! ఇండియాకి వచ్చి మీ అంద రితో మాట్లాడాలనే తెలుగు నేర్చుకున్నాను" మార్గ రేట్ చిన్నపిల్లలా మాట్లాడుతుంటే ఆనందంగా విన సాగాడు తాతయ్య.

"నా డెలివరీ టైంలో అత్తయ్య, మామయ్య మా దగ్గర ఉండాలనుకుంటున్నాం. మీరు తప్పుగా తీసుకోవద్దు. మిమ్మల్ని మంచి వృద్ధాశ్రమంలో వుంచుతాం. తిరిగి వాళ్ళు ఇండియాకి వచ్చిన తరువాత మీరు ఇంటికి వచ్చేద్దురుగానీ. ఇందులో మీకేమయినా అభ్యంతరముంటే చెప్పండి తాత య్యగారూ! మీరు మనస్ఫూర్తిగా ఒప్పుకుంటేనే అత్తయ్య మామయ్యల్ని మాతో తీసుకుని వెళ్తాం" బ్రతిమాలుతున్నట్లుగా అడిగింది మార్గరేట్.

గొంతు వణుకుతుంటే మాట్లాడడం ప్రారంభిం

చాడు రామనాధంగారు.

"పాపం రామారావు! ఈ రెండు సంవత్సరాలలో నాకు సేవలు చేసి బాగా అలసిపోయాడు. ఎప్పుడూ ముఖం మాడ్చుకోవడంగానీ, విసుక్కోవడంగానీ నేను చూసింది లేదు. వాడికీ కొంచెం మార్పు కావాలి.

తప్పకుండా వాళ్లిద్దర్నీ మీతోపాటు తీసుకుని వెళ్తామంటే నాకంతకన్నా కావలసినదేముంది. చాలా సంతోషం. నువ్వు మామీద ఇంత ప్రేమ చూపించడం నిజంగా చాలా ఆనందంగా వుందమ్మాయ్. నేను అబ్బాయితో మాట్లాడతాను. వాళ్లిద్దర్నీ మీతోపాటు పంపే బాధ్యత నాది" నమ్మకంగా చెప్పడంతో మార్గరేట్‌కి కొంచెం ధైర్యం వచ్చింది.

★★★

బాల్కనీలో నిలబడి ఆకాశాన్నే తదేకంగా చూస్తున్న కొడుకూ కోడలు దగ్గరికి వచ్చి నిలబడింది కామేశ్వరి.

"మార్గరేట్! నువ్వూ మాధవ్ గోవాకి వెళ్లి అక్కడ ప్రపంచ ప్రసిద్ధి చెందిన చర్చిని చూడాలని చెప్పావుకదా. మరి ఎప్పుడు బయలుదేరుతున్నారు?" అడిగింది కోడలి చేతులు పట్టుకుని కామేశ్వరి.

"మేము రెండునెలల లీవులో వచ్చాం అత్తయ్యా. మిమ్మల్ని, మామయ్యగారిని మాతోపాటు తీసుకుని వెళ్లడానికి ఏర్పాట్లు చేయాలి కదా. తాతగార్ని మంచి వృద్ధాశ్రమంలో చేర్పించాలి.

ఇవన్నీ చక్కగా అయిన తరువాతే దేవుడి దర్శనం" జవాబు చెప్పిన కోడల్ని తదేకంగా చూస్తూ ఉండిపోయింది కామేశ్వరి.

"మాధవ్‌ని అడిగితే వాడూ ఇలాగే అన్నాడు. కానీ మీ మామయ్యగారు ఒప్పుకుంటారా అన్నదే నాకు అనుమానంగా వుందమ్మా. పుట్టబోయే మనవడ్ని చూడాలన్న కోరికయితే మనసులో బోలెడు వుందిగానీ ఆయన ఏమంటారో చూడాలి మరి."

"మీరేం భయపడకండి. మామయ్యా తప్పకుండా వస్తారు. మీ మనవడ్ని ముందుగా మీరే ఎత్తుకుని ముద్దాడాలి. అదే నా ఆశ కూడానూ" నమ్మకంగా అంది మార్గరేట్.

★★★

రెండురోజుల తరువాత...

"మీరందరూ వారంరోజుల్నించీ చెవులు కొరుక్కుంటున్న విషయం నాకిప్పుడే తెలిసింది. నాన్న ఇప్పుడే అంతా చెప్పారు. కానీ ఇందులో చిన్న మార్పు. ఖచ్చితంగా మీ అమ్మ మీతో వస్తుంది. తనని మీతో తీసుకుని వెళ్లి మీతో వుంచుకుని, మనవడి ఆలనాపాలనా చూసుకోమని




చెప్పండి. మీకెప్పుడు తిరిగి పంపాలనిపిస్తే అప్పుడు పంపించండి. దయచేసి నన్ను మాత్రం బలవంతం చేయవద్దు ప్లీజ్...నాన్నగారిని ఈ స్థితిలో వదిలి పెట్టి రాలేను. వేరేవాళ్ల దగ్గర ఉంచడం నాకిష్టంలేదు. ఆయన ఆఖరిశ్వాస వరకూ నేను ప్రక్కనే ఉండాలనుకుంటున్నాను'' కొడుకును సమాధానపరిచాడు నెమ్మదిగా.

***

రాత్రి పడుకునే ముందు "ఏవండీ! మీరు లేకుండా నేను మాత్రం వెళ్లడం నాకిష్టం లేదండీ'' అంది కామేశ్వరి.


భార్యని ప్రేమగా చూసాడు రామారావు.

"కామూ! నువ్వు తప్పకుండా వాళ్లతో వెళ్లాలి. డెలివరీ సమయంలో నువ్వు మార్గరేట్ ప్రక్కన ఉండడం చాలా అవసరం. నా గురించి భయపడవద్దు. వంట చేయడానికి పనిపిల్ల వుంది. నాన్నగారిని చూసుకోవడానికి నేనున్నాను. నువ్వు మాత్రం ఎలాంటి కారణాలు చెప్పక బయలుదేరు'' అన్నాడు రామారావు భార్యకి ఆర్డరు వేస్తున్నట్లుగా.



## నిదానమే ప్రధానం

నిదానమే ప్రధానం అన్నట్టుగా ప్రియాంకా చోప్రా స్టార్ రేస్‌లో చాలా నిదానంగా పయనిస్తోంది. మిగతా హీరోయిన్స్‌తో పోలిస్తే ప్రియాంకా చోప్రా ఇప్పుడు హిందీ చిత్ర పరిశ్రమలో బిజీ స్టార్ అంటున్నారు అందరూ. ఇప్పటివరకూ ఆమె నటించిన చిత్రాలేవీ సూపర్ హిట్లు కాలేదు. అయినా ఆమె అదృష్టం బ్రహ్మాండంగా వుంది మరి! పెద్ద సంస్థల చిత్రాలు, టాప్ హీరోల సినిమాల్లో ప్రియాంకా అవకాశాలు చేజిక్కించుకుంటూ షూటింగ్‌ల కోసం అటూ ఇటూ పరుగులు తీస్తూ యమ బిజీగా కనిపించడం ఎంతోమంది సినీ జనాల్ని ఆశ్చర్యపరుస్తోంది.




***

కామేశ్వరికి వీసా ఏర్పాటు చేయడం జరిగింది.

ఇంకో పదిరోజుల్లో బయలుదేరాలి. తండ్రి తమతో రాకపోవడం మాధవ్‌కి బాధగానే ఉంది.

రాత్రి మాధవ్ రూములోకి వెళ్లింది కామేశ్వరి.

తల్లిని చూసి "ఏమ్మా! ఇంకా నిద్రపోలేదా? నాతో ఏమైనా పని ఉందా?'' ఆత్రుతగా అడిగాడు మాధవ్.

"మాధవ్! నేను ఓ మాట అడుగుతాను. తప్పుగా తీసుకోవద్దు. నాకు నాన్నగారిని వదిలి అమెరికా రావాలనిపించడంలేదురా. మీరు వెళ్లిరండి. తరువాత నేనూ నాన్నగారు వీలు చూసుకుని అక్కడికి వస్తాం.''

మాధవ్, మార్గరేట్‌లు ఆశ్చర్యంగా చూసారు కామేశ్వరిని.

"సర్లేమ్మా! నాకు అర్థమయిపోయింది. నువ్వు మార్గరేట్‌ని నీ కోడలుగా మనస్ఫూర్తిగా అంగీకరించలేదని తెలుస్తోంది. ఆమె వేరే దేశానికి చెంది ఉండవచ్చు. కానీ ఆమె ఈ ఇంటి వారసుడ్ని తన కడుపులో మోస్తోంది. మన దేశ సంస్కృతిని, ఇక్కడ ఒకరిపై ఒకరు చూపించుకునే ప్రేమాభిమానాల్ని చూసి నన్ను ప్రేమించి, పెళ్లి చేసుకుంది. డెలివరీ సమయంలో తనకి తోడుగా ఉండమని అడిగితే నిరాకరించడానికి మీ మనసెలా ఒప్పుకుంది? అమ్మా! నువ్వు, నాన్నగారు తనతోపాటు అమెరికా వస్తారని, తనకి తోడుగా ఉంటారని ఎంతో నమ్మకం పెట్టుకుంది మార్గరేట్. కానీ ఒక్క నిముషంలో మా నమ్మకాన్ని ముక్కలు చేసేసావుకదా'' మాధవ్ గొంతులో కోపం తొంగి చూసింది.

"లేదు మాధవ్. నేను చెప్పేది కొంచెం విను.''

"వద్దమ్మా! ప్లీజ్... ఇంతటితో ఈ టాపిక్‌కి ముగింపు పెట్టేద్దాం. మేము ఎలా వచ్చామో అలాగే వెళ్లిపోతాం. ఎవరూ మాతో రావద్దు'' అంటూ ముఖం తిప్పుకున్నాడు మాధవ్.

కామేశ్వరికి ఏం మాట్లాడాలో తెలీక నిశ్శబ్దంగా లేచి వెళ్లిపోయింది.

మార్గరేట్ విచారంలో మునిగిపోయింది.

"ఉండే పదిరోజుల్లో నువ్వు చూడాలనుకున్నవన్నీ చూసేసి బయలుదేరిపోదాం'' అన్నాడు మాధవ్ కళ్లల్లో తిరుగుతున్న నీటిని బయటకి రానీయకుండా.

***

"నాన్నగారూ! నేనూ, మార్గరేట్ ఇవ్వాళ గోవాకి బయలుదేరుతున్నాం. తిరిగి మేము అమెరికా బయలుదేరడానికి ఒకరోజు ముందే వస్తాము.''

"అలాగే వెళ్లిరా మాధవ్. మార్గరేట్‌కి అన్నీ చూపించు. అవన్నీ చూసిన తరువాత బాల ఏసు వంటి మనవడ్ని కని ఇవ్వమని చెప్పు'' అంటూ మౌనంగా నిలబడి వున్న కొడుకుకి దగ్గరగా వచ్చి "చూడు మాధవ్! అమ్మా నేనూ రావడంలేదని బాధపడకురా. నేను లేకుండా రావడానికి అమ్మ ఇష్టపడడంలేదు. ఇక్కడ మా బాధ్యతల్ని పూర్తిగా నిర్వహించిన తరువాత తప్పకుండా అమెరికా వస్తాం. సరేనా?'' కొడుకుని సమాధానపరిచాడు రామారావు.

"ఫ్లైట్‌కి టైం అయింది త్వరగా రా మార్గరేట్'' ఇంటి ముందు టాక్సీ వచ్చి నిలబడడంతో "ఆలస్యం చేయక'' అంటూ లోపలికి వెళ్లి ఫ్రిజ్ తెరిచి మంచి నీళ్ళు తాగుతున్న మాధవ్ దగ్గరికి నెమ్మదిగా వచ్చింది కామేశ్వరి.

చేతికి ఒక కవరిచ్చి "తొందరలేదులే. గోవాకి వెళ్లి అన్నీ చూసిన తరువాత

నిదానంగా ఈ ఉత్తరం చదువుకో'' అంది కళ్లల్లో నీళ్ళు తిప్పుకుంటూ.

కన్నీళ్ళు ఎందుకో అర్థంకాక మాధవ్ గబగబా నడిచి వెళ్లిపోయాడు కవరుతో.

ఎయిర్‌పోర్ట్‌లోని లాంజ్‌లో కూర్చున్న తరువాత జేబులోంచి లెటర్ తీసి మార్గరేట్ చేతికిచ్చాడు లోపల పెట్టమని. కానీ మార్గరేట్ అక్కడే లెటర్ విప్పి చదవసాగింది ఆత్రుతగా.

"ప్రియమైన మాధవ్, మార్గరేట్‌లకి,

దయచేసి మమ్మల్ని తప్పుగా అర్థం చేసుకోకండి. మీమీద మేము చూపించే ప్రేమలో ఏమాత్రమూ లోపంలేదు. ఇది మీరూ తెలుసుకోవాలి. అదీ కాకుండా మీ నాన్నగారిని మీరు తప్పుగా అర్థం చేసుకోకూడదని నేను ఇంతకాలం దాచిన ఒక రహస్యం మీకు చెప్పాలనుకుంటున్నాను.

మాధవ్! నువ్వు నా కడుపులో ఉన్నప్పుడే అనుకోని విధంగా ఒక ఆక్సిడెంట్‌లో మీ నాన్నగారు చనిపోయారు. ఈ రామారావుగారు మీ నాన్నకాదు. పెద్దల్ని ఎదిరించి పెళ్లి చేసుకుని అందర్నీ దూరం చేసుకున్నాను. మీ నాన్నగారి మరణంతో ఎవరి ఆదరాభిమానాలు లేక ఒంటరిగా మిగిలిపోయాను. అటువంటి సమయంలో మీ నాన్న స్నేహితులైన రామారావుగారు నన్ను పెళ్లి చేసుకుని సొసైటీలో నాకో అంతస్థు ఏర్పరిచారు. అలాగే నువ్వు తండ్రిలేని అనాధవి కాకూడదని తనే నీకు నాన్న అయ్యారు. నీ దగ్గర మనసు విప్పి చెబుతున్నాను.

ఈ క్షణంవరకూ మేమిద్దరం ఒక మంచి స్నేహితులుగానే వుండిపోయాం. మామధ్య ఎలాంటి దాంపత్య సంబంధాలులేవు. తన స్నేహితుడి కుటుంబం కోసం తన జీవితాన్నే కర్పూరంగా మార్చి కరిగిపోతున్నారు. ఇదేకాదు మాధవ్! పక్షవాతం వచ్చి కాలూ చెయ్యి పడిపోయిన మీ తాతకి తనే అన్నీ అయి చూసుకోసాగారు.

ఆయన కూడా రామారావుగారి తండ్రికాదు. ప్రేమ పెళ్లి చేసుకున్నానని నన్ను ఇంటినుంచి తరిమేసిన మా నాన్నే. అమ్మ చనిపోయిన తరువాత అన్నయ్యలు చేతులు దులిపేసుకుంటే ఎవరి ప్రేమకు నోచుకోక నా దగ్గరకు వచ్చారు.

ఆయన్ని మన కుటుంబంలో ఒకడిగా అనుకుని ఆదరించారు రామారావుగారు. ఆ రోజు నుంచి ఈ రోజువరకూ మీ తాతయ్యని తన తండ్రిగానే చూసుకుంటున్నారు రామారావుగారు.

ఆయనకి భార్యగా జీవిస్తున్న నేను నిజానికి భార్యగా ఏమీ ఇవ్వలేకపోయాను. భార్య ద్వారా లభించే సుఖాలు, సంతోషాలు ఆయనింతవరకూ పొందలేదు. నువ్వు ఆయన కొడుకువీకాదు, నీ తాతయ్య ఆయన తండ్రీ కాదు.

అయినా సరే ఆయన చూపే ప్రేమానురాగాలలో నువ్వేమయినా తప్పు పట్టగలవా? చెప్పు మాధవ్! జన్మతా వచ్చేవే కాదు బంధుత్వాలు... ప్రేమతో, అనురాగంతో కూడా బంధుత్వాలని ఏర్పరచుకోవచ్చునని నిరూపించారు మీ నాన్నగారు. అలాంటి ఆయన్ని విడిచిపెట్టి మీతో రావడం న్యాయమంటావా? జీవితాంతం ఆయన ప్రక్కనే ఉండి ఆయన సేవతోనే గడపాలన్నదే నా కోరిక!

నువ్వు మార్గరేట్‌ని పెళ్లి చేసుకోవడం... నిజం చెప్పాలంటే నాకిష్టంలేదు. మీ నాన్నే నా మనసు మార్చి నన్ను ఒప్పించారు. నేను చెప్పిన ఈ విషయాల్ని మీ నాన్నగారికి తెలియనివ్వకండి. ఆయన మీ వద్దనుంచి ఆశించేది మీ ప్రేమని మాత్రమే!''

ప్రేమతో
అమ్మ

***

మంచంమీద కళ్ళు మూసుకుని పడుకుని వున్న రామారావుకి నీడలాడినట్లనిపిస్తే కళ్ళు తెరిచి చూసారు.

ఎదురుగా మాధవ్, మార్గరెట్.

"ఏమిటి మాధవ్... ఏమైంది? ఫ్లైట్ కాన్సిల్ అయిందా?'' అంటూ లేచి కూర్చున్నాడు రామారావు.

"లేదు నాన్నగారూ! ఉన్న పదిరోజులూ మీతోనూ, అమ్మతోనూ గడపాలని గోవా వెళ్లకుండా వచ్చేసాం'' తండ్రిని ఆరాధనగా చూస్తూ అన్నాడు మాధవ్.

'నేను చూడాలని ఆశపడ్డ ఆ బాల ఏసు నా కళ్లెదురుగా ప్రశాంతంగా కూర్చుని వుంటే, మీ కాళ్ల దగ్గర ఆనందంగా జీవించాలని వచ్చేసాం మామయ్యా' అని మనసులో అనుకుంటూ కామేశ్వరిని మంచం మీద కూర్చోబెట్టి వాళ్ల కాళ్ల దగ్గర కూర్చుంది మార్గరెట్ కళ్లల్లో ఆనందభాష్పాలు తిరుగుతూ వుంటే!

★

## 'చెత్త' నగరం

మన దేశ రాజధాని 'చెత్త' నిండిన నగరంగా పేరు పొందడానికి కారణం ఢిల్లీ మున్సిపాలిటీ వారి ప్రయోజకత్వమే. ఢిల్లీ మున్సిపాలిటీలో 50 వేల మంది స్వీపర్లున్నారు. ఒక్కో చదరపు కిలోమీటరుకు 34 మంది ఉండాలన్నది నియమం. వీరిలో 35 వేల మంది పర్మినెంట్ ఉద్యోగులు. సాధారణంగా చాలారోజులపాటు పనిలోకి రారు. వచ్చినా పని చేయరు. ఒకటో తారీఖున జీతాలకి మాత్రం ఠంచనుగా వచ్చేస్తారు. ఇక రోడ్లు ఊడ్చేది కేవలం 15 వేలమంది టెంపరరీ స్వీపర్లే. ఇటీవల వాళ్లు వాళ్ల సీనియర్ల నుంచి జ్ఞానోపదేశం పొందినట్లున్నారు... రోడ్లు తుడవకపోయినా, చెత్తను ఎత్తకపోయినా జీతాలలో కోత అంటూ ఉండదని. అందుచేత మరే స్వంత పని లేని రోజున ఒకసారివచ్చి చీపుళ్లతో వీరవిహారం చేస్తూ రోడ్డునపోయే వాళ్ల కళ్లల్లో దుమ్ము కొట్టి పోతున్నారు. ఇందులో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు.

ఒకరోజున అధికారులు హాజరుపట్టీ తిరగేస్తే కేవలం 1500 మంది మాత్రమే హాజరయ్యారట. మరి మిగిలిన 48,500 మంది గైరు హాజరనేగా అర్థం. చెత్త రాజకీయాలతో నిండిన దేశ రాజధానిలో చెత్త పేరుకుపోవడంలో ఆశ్చర్యమేముంది?

-విమలారామం

